క్లుప్తంగా

గేట్‌వాల్వ్‌కు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

పర్వతగిరి : మండలంలోని కల్లెడ బీసీ కాలనీకి నీటిని సరఫరా చేసే గేట్‌వాల్వ్‌కు మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు. 'తాగునీటికి తప్పని తిప్పలు' శీర్షికతో సోమవారం ప్రచురితమైన 'సాక్షి' కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందితో గేట్‌వాల్వ్ సరి చేయించి పైపులైన్ పనులను చేపట్టగా ఎంపీడీఓ శంకర్‌నాయక్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. బీసీ కాలనీకి నేడు (మంగళవారం) తప్పనిసరిగా తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. మరమ్మతు పనులను ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మాధవుడు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చెన్నారావుపేట : రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ సైక్లింగ్ పోటీలకు మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులు కొలువుల అర్చన, మాలోతు సాగర్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో ఇద్దరు విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేశ్‌ను ప్రిన్సిపాల్ అభినందించి మాట్లాడారు. వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అర్చన, సాగర్ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ



నర్సంపేట : క్రియేటివిటీ కరాటే టు అకాడమీ ఆధ్వర్యంలో పరకాలలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హైస్కూల్ విద్యార్థి నాడెం తేజ 14 ఏళ్ల బాలుర కటాస్ విభాగంలో ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా తేజను స్కూల్ చైర్మన్ రమేశ్, ప్రిన్సిపాల్ నవిత, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. తేజకు శిక్షణ ఇచ్చిన స్కూల్ కరాటే కోచ్ షేక్ జానీకి బెస్ట్ కోచింగ్ అవార్డు రావడం పట్ల చైర్మన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్ల–ఆత్మకూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా.. వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు చెందిన బయ్య పోచమ్మ–సమ్మయ్య దంపతులు బైక్‌పై ఆత్మకూరుకు వెళ్తుండగా మొగిలిచర్ల ప్రధాన రహదారిలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ సమీపంలో స్టోన్ క్రషర్‌కు చెందిన టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచమ్మ, సమ్మయ్య గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడికి..

సంగెం : ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుకు గాయాలైన ఘటన మండలంలోని ఎల్గూర్ మాన్యాల వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని కొత్తగూడెంకు చెందిన గౌడుగు రమేశ్ తిమ్మాపూర్‌కు వెళ్లి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎల్గూర్ మాన్యాల వద్ద గాంధీనగర్‌కు చెందిన వాసం నగేశ్ నడుపుతున్న మొరం ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేశ్‌కు గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రమేశ్ కుమారుడు శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గీత కార్మికుడికి పరామర్శ



పర్వతగిరి : మండలంలోని సోమారం గ్రామానికి చెందిన గీత కార్మి కుడు నాళం యాకాంబ్రం ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేశ్ ఆస్పత్రిలో సోమవారం పరామర్శించారు. వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరేశ్ మాట్లాడారు. మండలంలోని 10 రోజుల వ్యవధిలో ముగ్గురు గీత కార్మికులు తాటిచెట్టుపై నుండి పడి ప్రమాదానికి గురయ్యారని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నాగపురి వెంకటేశ్, రాజేశ్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా ప్రారంభం ఎప్పుడో?

- నిర్మించి ఏడాదిన్నర పూర్తి
- అద్దె భవనంలోనే కొనసాగిస్తున్న దుస్థితి

నర్సంపేట రూరల్ : పేదలకు గ్రామస్థాయిలో మెరుగైనా వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజుపేట పల్లె దవాఖానా ప్రారంభం ఎప్పుడో? అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. వైద్యురాలిని సైతం దవాఖానాకు కేటాయించారు. భవనం నిర్మించి ఏడాదిన్నర పూర్తి అయ్యినా బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ నీటి, విద్యుత్ సదుపాయాలు కల్పించలేదు. దీంతో పనులు పూర్తికాక కాంట్రాక్టర్ భవనాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించలేదు. ఈ క్రమంలో నూతన భవనం వృథాగా ఉండగా పల్లె దవాఖానా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. బిల్లులు చెల్లించకుండా స్వల్ప పనులు పెండింగ్‌లో ఉంచి ఏడాదిగా పల్లె దవాఖానాను అద్దె భవనంలో కొనసాగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామంలో నాటి ప్రభుత్వం పల్లె దవాఖానాకు పక్కా భవనం నిర్మించేందుకు సుమారు రూ.16 లక్షలు మంజూరు చేసింది. టెండర్, ఇతర ప్రక్రియ పూర్తి కావడంతో కాంట్రాక్ట్ పనులు త్వరితగతిన పూర్తిగా చేశారు. పల్లె దవాఖానాను ప్రారంభిస్తారనుకున్న సమయంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పల్లె దవాఖానా ప్రారంభానికి నోచుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రారంభించడం లేదు. ఈ క్రమంలో వైద్యసిబ్బంది ఇరుకుగా ఉన్న అద్దె గదిలోనే వైద్యసేవలు అందిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామస్తులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాల్లేవు.



రాజుపేట పల్లె దవాఖానా నూతన భవనం

అద్దె భవనంలోనే సేవలు ...

రాజుపేట పల్లె దవాఖానాలో రాజుపేట, గార్లగడ్డ తండా, చింతగడ్డతండా, ముత్యాలతమ్మతండా, మంజ్యానాయక్‌తండా, జంగాలపల్లి తండా నుంచి ప్రజలు వైద్యసేవలు పొందుతారు. వాక్సినేషన్ సమయంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు నేరుగా గ్రామాలకు, తండాలకు వెళ్లి ఇంజెక్షన్ ఇస్తారు. మిగతా సందర్భాల్లో ప్రజలు రాజుపేటకు వచ్చి వైద్యం చేయించుకుంటారు. అద్దె భవనంలో పల్లె దవాఖానా కొనసాగుతుండడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె సైతం చెల్లించడం లేదంటూ ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం కొసమెరుపు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పల్లె దవాఖాన నూతన భవనంలో మిగిలిపోయిన పనులు పూర్తి చేయించి ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి, ఇతర పనులు పెండింగ్‌లో ఉండడంతో..



రాజుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్మించి పల్లె దవాఖానాకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. ఆ పనులను పెండింగ్‌లో ఉండడంతో ఏడాదిన్నరగా భవనం ఖాళీగానే ఉంటోంది. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పల్లె దవాఖానాను ప్రారంభిస్తే ప్రజలు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

– అరుణ్‌చంద్ర, వైద్యాధికారి, భాంజీపేట

అర్హులకే సంక్షేమ పథకాల అమలు



వర్ధన్నపేట : క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



రాయపర్తి : బస్టాండ్ ఆవరణలో..

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య

వర్ధన్నపేట : బీఆర్ఎస్ హయాంలో వందల ఎకరాల భూములున్న సంపన్నులకు సంక్షేమ పథకాలు అందించి ప్రజాధనాన్ని దోచిపెట్టగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించే దిశగా ముందుకు సాగుతోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. ఇల్లంద వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ అగ్రనేతలు, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో వందలాది ఎకరాల భూములున్న మాజీ మంత్రులు దయాకర్‌రావు, మల్లారెడ్డికి, తదితరులకు రైతుబంధు ఇచ్చి పేద రైతులకు మొండిచేయి చూపినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన రైతులకే రైతుభరోసా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పోశాల వెంకన్న, మైదం బుచ్చిమల్లు, కమ్మగోని ప్రభాకర్, పత్రి భాను, ఎద్దు శ్రీనివాస్, గడ్డం సమ్మయ్య, చిదుముల బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, నాయకుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. అన్నదాత ఆర్థికాభివృద్ధే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని చెప్పారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, నాయకులు మచ్చ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : ధర్నా చేస్తున్న సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు



రైతుభరోసా రూ.15 వేలు ఇవ్వాల్సిందే

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : అర్హులందరికీ రైతుభరోసా కింద రూ.15 వేలు చొప్పున ఇవ్వాల్సిందేనని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, రాయపర్తి, ఖానాపురం, పర్వతగిరి, సంగెం, గీసుకొండ, తదితర మండలాల్లో సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మండలాల్లో ఇతర నాయకులు మాట్లాడారు. రైతుభరోసా సాయం ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని నమ్మించి రూ.12 వేలకు పరిమితం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ తొలిదఫా రైతుభరోసా కింద రూ.2,500 తక్కువ ఇచ్చిందని, వానాకాలం ఎగొట్టిందని తెలిపారు. యాసంగి పంటకు ఇవ్వాల్సిన డబ్బుతో కలిపి మొత్తం ఎకరానికి రూ.17 వేల 500 చొప్పున ఇవ్వాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. రైతుల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



నర్సంపేట : అమరవీరుల స్తూపం వద్ద..



పర్వతగిరి : మండల కేంద్రంలో..



నల్లబెల్లి : జాతీయ రహదారిపై..



రాయపర్తి : వరంగల్-ఖమ్మం రహదారిపై..

అవగాహనతో అధిక దిగుబడులు

- ఏఓ విజయ్‌కుమార్

వర్ధన్నపేట : పంటల సాగుపై అవగాహన పెంచుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించగలరని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దమ్మన్నపేటలో సోమవారం నిర్వహించిన ఏరువాక రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్పత్తిదారుల సంఘాలు ప్రాసెస్‌పై ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. తద్వారా సీజనల్ పంటల ధరలు నిలకడగా ఉండి రైతులు నష్టం వాటిల్లదని చెప్పారు. పండించే పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాణ్యమైన పంట పండిస్తే సరైన ధర లభిస్తుందని తెలిపారు. పశు వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ ఉమ్మడి వ్యవసాయంతో పంటకు గిట్టుబాటు ధర లభించేలా అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ముఖ్యంగా వ్యాపారంపై అవగాహన పెంచుకోవాలని, పంటలను ప్రాసెస్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పందన సొసైటీ కార్యదర్శి చొప్పరి సోమయ్య, ఏఈఓ మురళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశు వైద్యాధికారి రాజేందర్

గోదావరి జలాలను పొదుపుగా వాడుకోవాలి



నల్లబెల్లి : గోదావరి జలాలను రైతులు పొదుపుగా వాడుకోవాలని దేవాదుల డీఈ యశ్వంత్ కోరారు. మండలంలోని రంగయ్య చెరువులోకి గోదావరి జలాలు విడుదల కాగా సోమవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి మాట్లాడారు. రైతుల సాగునీటి అవసరాల కోసం పాకాల పైపులైన్ ద్వారా గోదావరి జలాలను చెరువులోకి రెండ్రోజులుగా వదులుతున్నట్లు తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయవద్దని సూచించారు. ఆయన వెంట దేవాదుల ఏఈలు శ్రీనివాస్ నాయక్, లావణ్యరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మునేందర్, మేఘా కంపెనీ ఇంజనీర్ ఆదినారాయణ, తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధనే లక్ష్యం

- సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

నర్సంపేట : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధించడమే లక్ష్యంగా ఈనెల 8న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సమర శంఖారావం తలపెట్టినట్టు బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జి డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో సంఘం పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శంఖారావం వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి సోమవారం డ్యాగల శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న 12 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు బొనగాని రవీందర్, మండల కార్యదర్శి బేతి భాస్కర్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మద్దెల శ్యాంకుమార్ యాదవ్, యువజన విభాగం పట్టణ కార్యదర్శి గోపగాని నాగరాజు, నాయకులు గుంటుక రాజ్‌కుమార్, తరిగొప్పుల ప్రవీణ్, దాడి మధు, శివరాత్రి శ్రీనివాస్, నాగపురి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, విద్యార్థులు

పీడీఎస్ బియ్యం స్వాధీనం



నర్సంపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వ చేసిన 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్ వివరాలు వెల్లడించారు. పేదలకు పంపిణీ చేయాల్సిన పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముకునేందుకు నర్సంపేటలోని కమలాపురం గ్రామానికి చెందిన అనుముల రాము ఇంట్లో నిల్వ చేశారన్న సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.45 వేలు ఉంటుంది. బియ్యాన్ని సీజ్ చేసి అనుముల రాము, అతనికి సహకరించిన ఎక్కటి కిరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సైలు వివరించారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు సరికాదు

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు

పర్వతగిరి : పదేళ్లపాటు గతంలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతోపాటు ప్రజలను విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అనేక ఆశలు, ఆకాంక్షలతో బీఆర్ఎస్‌ను గెలిపించగా కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లపాటు ప్రజలను వంచించారని తెలిపారు. దళితుడిని సీఎం చేస్తామన్న, దళితులకు మూడు ఎకరాల చొప్పున భూపంపిణీ, ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, తదితర ఎన్నికల హామీలు విస్మరించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, ఉచిత విద్యుత్ సరఫరా, మహిళలకు ఉచిత ప్రయాణం, తదితర హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. త్వరలో భూమి లేని పేదలకు రూ.12 వేల సాయం అందిస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌రావు

కోతదశలో సస్యరక్షణ చర్యలు కీలకం

- హార్టికల్చర్ అధికారి జ్యోతి

నర్సంపేట రూరల్ : మిర్చి పంట కోత దశలో సస్యరక్షణ చర్యలు కీలకమని హార్టికల్చర్ అధికారి జ్యోతి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేట, భాంజీపేట గ్రామాల్లో మిర్చి పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు అందించారు. మిర్చి పంట పండిన తర్వాతే కోయాలని చెప్పారు. బాగా ఆరబెట్టి తేమ లేకుండా చూసుకోవాలని తెలిపారు. చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలన్నారు. మంచి మిర్చి నుంచి తాలు వేరు చేసి బస్తాల్లో వేర్వేరుగా నింపాలని చెప్పారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే పంటను సరైన ధరకు విక్రయించొచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు సాంబయ్య, మొలుగూరి సురేందర్, కేశెట్టి సదానందం తదితరులు పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న జ్యోతి

'డ్రంకెన్ డ్రైవ్'లో ఒకరికి జైలు

నెక్కొండ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 31న మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గాజులగట్టుకు చెందిన సంపత్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. సంపత్‌ను నర్సంపేట స్పెషల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి లక్ష్మినారాయణ మూడు రోజుల సాధారణ జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు వివరించారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి



నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ జున్ను ప్రభాకర్ (49) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. తెల్లవారుజామున మూత్రవిసర్జనకు వెళ్లిన సమయంలో ఆయన గుండెపోటుకు గురై కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబాన్ని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు పరామర్శించారు. తొలుత ప్రభాకర్ మృతదేహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో డీలర్లు ఇంగ్లే శివాజీ, తోటకూరి దేవేందర్, యాదగిరి, గోపి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి ధారణ



సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు సోమవారం ఘనంగా ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు. మండల దీక్ష పూర్తి చేసుకున్న పలువురు అయ్యప్ప స్వాములకు గురుస్వాములు ఇరుముడి కట్టారు. అనంతరం అయ్యప్ప స్వాములు శబరిమలైకి బయల్దేరి వెళ్లారు. తొలుత అయ్యప్పస్వాములు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం



- ఎస్సై చందర్

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఈనెల 31 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎస్సై చందర్ తెలిపారు. పట్టణంలో వాహన చోదకులకు సోమవారం గులాబీ పువ్వులు అందిస్తూ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. వాహన చోదకులు రహదారి భద్రత నియమాలు పాటించాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వ్యక్తులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే ప్రజలు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని చెప్పారు.

నివాళి

చెన్నారావుపేట : మండలంలోని భగవాన్‌తండాకు చెందిన జాటోతు అమ్మి అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందగా ఆమె మృతదేహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ రాజేందర్, మాజీ సర్పంచ్ భద్రునాయక్, నాయకులు మేగ్యా, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన కట్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కట్టయ్య పదో తరగతి నాటి స్నేహితులు సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత కట్టయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణ, వెంకన్న, కోరె సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగల్‌లో..

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌కు చెందిన మాసాని రవి కుమారుడు దిలీప్ ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబానికి జాంబవ పొదుపు సంఘం నిర్వాహకులు సోమవారం రూ.5 వేల సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాసాని గోపాల్, కార్యదర్శి మాసాని భిక్షపతి, కోశాధికారి మాసాని యాకూబ్, నాయకులు మంకాల శ్రీనివాస్, మాసాని భాస్కర్, మాసాని సుధాకర్, మాసాని భాస్కర్, గౌరారపు రాజు, తదితరులు పాల్గొన్నారు.